

రథంలో స్వామి, అమ్మవార్లు



నా సామీ...





చల్లగా చూడు ఖాద్రీశుడా...

నమో నారసింహా..!



రథోత్సవానికి ముందు పూజలు చేస్తున్న వేదపండితులు



ఈ మాత్రం సరదా ఉండాల్సిందే..



రథోత్సవంలో సాంస్కృతిక సందడి



ఇదిగో సామీ... గుమ్మడి కాయ...



మండే ఎండలో.. స్వామి చల్లని చూపుల కోసం..



కాటమ రాయుడా... కరుణించు తండ్రీ...

అట్టహాసంగా ఖాద్రీశుడి

బ్రహ్మరథోత్సవం

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మ రథోత్సవం కన్నులపండువగా సాగింది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో పుర వీధులు మార్మోగాయి. తిరువీధులు కిక్కిరిసిపోయాయి. రథంపై దేవదేవుడిని వీక్షించిన భక్తులు.. తన్మయత్వంతో నమో నారసింహ అని నినాదాలు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ముఖ్యమైనది బ్రహ్మరథోత్సవం. ఈ వేడుకకు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. స్వామివారి బ్రహ్మరథోత్సవం గురువారం ఉదయం 8.16 గంటలకు ప్రారంభమైంది. అంతకు ముందు వేద పండితులు రథారోహణం గావించారు. రథం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఏవీ నరసింహాచార్యులు, ఏవీ పార్థసారధీ అచార్యులు పుణ్యాహవచనం, బలిహరణ, కుంభహారతి నిర్వహించారు. అనంతరం రథంలో స్వామి వారి ఆరాధన, అక్షతారోహణం చేశారు. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవారిని (తరువాయి 7లో)

గోవింద నామస్మరణతో మార్మోగిన తిరువీధులు

ఉదయం 8.16 గంటలకు కదిలిన బ్రహ్మరథం

మధ్యాహ్నం 3.56 గంటలకు యథాస్థానానికి..

వేలాది మంది భక్తులతో కిటకిటలాడిన కదిరి

ధర్మవరం కళాకారుడికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం



చిప్పల చంద్రశేఖర్

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తోలుబొమ్మల కళాకారుడు చిప్పల చంద్రశేఖర్‌కు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయనకు లేఖ పంపారు. డిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించే ఎక్స్‌పోలో స్టాల్ ఏర్పాటుకు ఆయనకు ఆహ్వానం అందింది. దేశ రాజధానిలో హస్త కళల ప్రత్యేకతను తెలియజేయడానికి ఇదొక గొప్ప అవకాశమని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ విద్యార్థులు ఆధార్ తెచ్చుకోవాలి

ఏడీ లాజర్

కొత్తచెరువు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తెచ్చుకోవాలని ఓపెన్ స్కూల్ ఏడీ లాజర్ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పరీక్షలకు తప్పక తీసుకు రావాలన్నారు.

పరిశ్రమల స్థాపనతో ఆర్థిక ప్రగతి : కలెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగు పెట్టాలనుకునేవారికి ఆర్థికసాయం అందించేందుకు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీసహానీ, డీపీఓ సమత, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.35 (శుక్రవారం సాయంత్రం)

సెహరీ : 5.02 (శనివారం ఉదయం)

ఎండలతో భద్రం..!

వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి

ద్రవాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

వేసవి నేపథ్యంలో వైద్యుల సూచన





పుట్టపర్తి రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండిపోతుండడంతో జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఇక వృద్ధుల పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. వీరు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. అప్రమత్తతో సరైన జాగ్రత్తలు పాటిస్తే ఎండాకాలంలోను వృద్ధులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని అంటున్నారు. వేసవి నేపథ్యంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం పలు సూచనలు చేశారు. ఎండాకాలం అనగానే చెమటలు పట్టడం సర్వసాధారణం. అందువల్ల శరీరంలోని వేడి బయటకు వెళ్లి చల్లగా మారడానికి ఆస్కారం ఉంటుంది. వృద్ధుల్లో రక్తప్రసరణ తక్కువగా ఉండడంతో చెమటలు పట్టవు. వేడి శరీరంలో ఉండిపోవడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉంది. వయసు మళ్లిన వారిలో ఎక్కువమందికి మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉంటాయి. ఇందుకోసం వాడే మందుల వల్ల చెమట పట్టే తత్వం తక్కువ వుంటుంది. ఇదే సమయంలో మూత్రానికి ఎక్కువసార్లు వెళ్లాల్సి వస్తుంటుంది. ఇలా శరీరంలో నీటిని కోల్పోతారు. హృదయ సంబంధ, వణుకుడు వ్యాధులు ఉన్నవారు వాడే మందుల కారణంగాను శరీరానికి చెమట పట్టే గుణాన్ని కోల్పోతారు. మానసిక సమస్యలతో బాధపడేవారిలో ఈ ఇబ్బంది ఉంటుంది. మూత్రానికి ఎక్కువగా వెళ్లాల్సి వస్తుందన్న కారణంతో కొందరు నీళ్ల తక్కువగా తాగుతుంటారు. అదే సమయంలో వృద్ధుల్లో నీరు తాగాలనే ధ్యాస, దాహం వేసే గుణం మందగిస్తాయి. ఫలితంగా శరీరంలో మూడోవంతు నీటి ధాతువును కోల్పోతుంది. ప్రొస్టేటు గ్రంధి, మూత్రకోశ వ్యాధి ఉన్నవారు నీళ్ల తక్కువ తాగడం వల్ల శరీరం పొడారిపోయి వడదెబ్బకు గురవుతారు. వృద్ధులు వేసవిలో తప్పక నేత దుస్తులనే ధరించాలి. అవి వదులుగా ఉండాలి. గదులు చల్లగా ఉండేలా చూసుకోవాలి. తలనొప్పిగా ఉన్నా, కళ్లు తిరిగినా, వాంతులు, విరేచనాలు అవుతున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈలోగా ఓఆర్ఎస్ తాగించాలి. కొబ్బరినీళ్ల ఇస్తే శరీరానికి అవసరమైన లవణాలు అందుతాయి. పలచటి మజ్జిగ, తేలికగా అరిగే ఆహారం ఎక్కువగా ద్రవపదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏప్రిల్, మే నెలల్లో ఎట్టి పరిస్థితుల్లో వృద్ధులు బయటకు రాకపోవడమే ఉత్తమం.



జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం



నిపుణుల సూచనలు

- ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి వ్యాయామం ఒక సాధనం. వేసవిలోనూ వృద్ధులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయవచ్చు. ఉదయాన్నే చేయడం ఉత్తమం. ఇందుకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వైద్యుల సలహా తీసుకోవాలి.
- ఉదయాన్నే తేనేరు తీసుకుని శరీరం సహకరించే వ్యాయామం చేయాలి. వీలైనంతవరకు నడిస్తే సరిపోతుంది. యోగాసనాలు, ధ్యానం మంచిది.
- మజ్జిగ కలిపిన జావ పదార్థాలు తీసుకుంటే ఎండవేడిమిని తట్టుకోగలరు.
- పోషక విలువలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. నూనెలు, మసాలాలతో తయారు చేసిన వాటికి దూరంగా ఉండాలి.
- తీసుకున్న ఆహారం అరిగేటట్టు వ్యాయామం ఉండేట్లు చూసుకోవాలి.
- ఒకేసారి ఎక్కువగా తినేసి ఆయాస పడకుండా పలుసార్లు తిని శరీరం తేలికగా ఉండేలా జాగ్రత్తపడాలి.
- ఆకుకూరలు, పండ్లు తీసుకుంటే అమ్లజనకాల ఉత్పత్తికి దోహదపడతాయి.
- మినరల్స్ ఒంటికి పట్టేలా నిమ్మరసం, తేనె, చిటికెడు ఉప్పు, పంచదార కలిపిన ద్రావకం ఎక్కువగా తీసుకోవాలి.

2003లో నియమితులైన వారికీ పాత పెన్షన్ ఇవ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తి రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 2003లో ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా నియామకం పొం దిన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూ రారెడ్డి.. ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావించారు. టీచర్లతోపాటు పోలీసు కానిస్టేబుళ్ల ఇతర ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్ 2 ద్వారా ఉద్యోగాలు పొందిన 11వేల మందికి పాతపెన్షన్‌ను వర్తింపజేయాలని కోరారు.

వందే భారత్

రైలుకు జై కొడుతున్న ప్రయాణికులు

సేవలపై సంతృప్తి

టిక్కెట్టు ధరలు కాస్త ఎక్కువ అంటున్న పలువురు



వివరాలు 6వ పేజీలో...

ఇఫ్తార్ విందు ఆహ్వానం



మా నాన్నగారైన స్వర్గీయ చమన్‌సాబ్ గారి ఆశయాలను కొనసాగిస్తూ..
ఆయన చూపిన బాటలోనే నడుచుకుంటూ...
పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాసాలతో అల్లాను ప్రార్థిస్తున్న ముస్లీం మైనారిటీ, నూర్‌బాషా దూదేకుల సోదర సోదరీమణులకు నేడు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడమైనది.
ఈ కార్యక్రమం నందు అందరూ పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించి అల్లా దువాలో పాల్గొన వలసినదిగా మనవి చేస్తూ.. మీ

తేదీ: 21-03-2025 శుక్రవారం
సాయంత్రం 6.30 గంటలకు
వేదిక: R.కన్వెన్షన్ హాల్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయం ప్రక్కన, కక్కలపల్లి రోడ్, అనంతపురం.



డా. ఉమర్ ముక్తార్
టీడీపీ యువ నాయకులు, అనంతపురం

వందే భారత్!

- రైలుకు జై కొడుతున్న ప్రయాణికులు
- సేవలపై సంతృప్తి
- టిక్కెట్టు ధరలు కాస్త ఎక్కువ అంటున్న పలువురు



బెంగళూరు-కలబురగి వందే భారత్ రైలు



గుంతకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలుకు జనం జై కొడుతున్నారు. రైలులో ప్రయాణం, సేవలు అద్భుతమని పేర్కొంటున్నారు. టిక్కెట్టు ధరలే కాస్త ఎక్కువ అంటూ పలువురు పేర్కొంటున్నారు. అయినా, సేవలు ఆ స్థాయిలోనే అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కలబురగి-బెంగళూరు-కలబురగి వందేభారత్ రైలు (నం.22231/32) ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా వందేభారత్ రైలు ప్రయాణికులను 'ఆంధ్రజ్యోతి' స్థానిక రైల్వే స్టేషన్‌లో పలకరించింది. వారి అనుభవాలను అడిగి తెలుసుకుంది. టిక్కెట్టు ధరతో ముడిపెట్టకుండా చూస్తే వందేభారత్ రైలు సేవలు అత్యుత్తమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. పగటివేళ తిరిగే ఈ రైలు వల్ల ప్రయాణ బడలిక లేకుండా గమ్యస్థానాలకు చేరుకుంటున్నామని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. రిజర్వేషన్ విధానం వల్ల వందలాది సీట్లు ఖాళీగా ఉన్నా, చివరి నిమిషంలో ఈ రైల్లో ప్రయాణించడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే శాఖ చొరవ చూపాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

రెండో తరం రైలు

వందేభారత్ రైళ్లలో రెండో తరం రైలును బెంగళూరు-కలబురగి (గుల్బర్గా) మధ్య గత సంవత్సరం మార్చి 12వ తేదీన ప్రారంభ రన్ నిర్వహించారు. ఇది వందేభారత్ రైళ్లలో 26వది. కలబురగి-బెంగళూరు మధ్య 548 కి.మీ.ల దూరాన్ని 8 గంటలా 45 నిమిషాల వ్యవధిలో చేరుకునేలా సమయాలను నిర్ణయించారు. ఈ రైలు కలబురగిలో ఉదయం 5.15కి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుంది. గంటకు 63 కి.మీ.ల సగటు, 130 కి.మీ.ల గరిష్ఠం వేగంతో ప్రయాణిస్తోంది. కేవలం ఆరు స్టాపింగ్‌లు ఉంటాయి. కలబురగిలో బయలుదేరే ఈ రైలును యాద్గిర్, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, అనంతపురం, యల్హంక స్టేషన్లలో మాత్రమే నిలుపుతున్నారు. శుక్రవారం మినహా వారంలో ఆరు రోజులు ఈ రైలును నడుపుతున్నారు.

యాన్ని దృష్టిలో ఉంచుకుని పగటి వేళలో బయలుదేరి, సాయంత్రంలోపు గమ్యస్థానానికి చేరుకునేలా వందేభారత్ రైళ్లను రూపొందించారు. ఈ రైళ్లల్లో బెర్తులు ఉండవు. (త్వరలో బెర్తులు కలిగిన వందేభారత్ రైళ్లను ప్రవేశ పెట్టనున్నారు). బస్సుల్లో మాదిరి కూర్చుని ప్రయాణించడానికి వీలుగా రెండు రకాల టిక్కెట్లను జారీ చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్, ఎకానమీ చైర్ అనే రెండు స్థాయిల కార్ సిస్టం ఈ వందే భారత్ రైలులో ఉంది. ఎగ్జిక్యూటివ్ చైర్ ధర ఎకానమీ కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. విమానాల మాదిరిగా టిక్కెట్ బుకింగ్ సమయంలోనే ఆహారాన్ని ఆర్డర్ ఇచ్చేలా ఆన్‌లైన్ యాప్‌ను రూపొందించారు. రేటు ఎక్కువగా ఉన్నా దానికి తగినంత సేవలు అందిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మరి కొందరు ధర ఎక్కువని ఆర్థిక ఇబ్బందిని వ్యక్తం చేస్తున్నారు. బస్సు కంటే ఎంతో మెరుగ్గా ప్రయాణం సాగుతోందని ప్రయాణికులందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారు.

సేవలు అద్భుతం



వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వందే భారత్ రైలులో వెళ్తుంటా. టిక్కెట్టు రేటు ఎక్కువైనా అందులో సేవలు అద్భుతంగా ఉన్నాయి. విమానాల్లో మాదిరిగానే వేళకు టీ, టిఫిన్, భోజనం అందిస్తున్నారు. ఆహారం బాగా ఉంటోంది. పరిశుభ్రత పాటిస్తున్నారు. కుదుపుల్లేని ప్రయాణం, సకాలంలో గమ్యస్థానానికి చేర్చడం నచ్చింది. టిక్కెట్టు రేట్లు ఎక్కువగా ఉన్నాయని చింతించాల్సిన అవసరం లేదు. డబ్బుకు తగిన సేవలు అందిస్తున్నారు.

-సంజయ్ జీరావాలా, వ్యాపారి, గుంతకల్లు

పగటిపూట అనుకూలం

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో పగటి వేళల్లో ప్రణించడానికి కూడా బెర్త్‌ను రిజర్వు చేయాల్సి ఉంటుంది. రిజర్వేషన్ చేసినా పగటి వేళ కింద, మధ్య బెర్తుల ప్రయాణికులు పడుకోవడానికి వీలుండదు. కనుక సాధారణంగా పగటి వేళల్లో ప్రయాణికులు కూర్చునే ప్రయాణిస్తారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని...

టిక్కెట్టు సమస్య

సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉన్నపుడు బెర్తులు ఖాళీగా ఉండవు. ఒకవేళ చివరి నిమిషంలో ప్రయాణికులు టిక్కెట్టు రద్దు చేసుకున్నా ఖాళీగా ఉండే ఆ బెర్తును టీటీఈ వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికులకు కేటాయించే అవకాశం ఉంది. ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లలో వెయిటింగ్ లిస్టు టిక్కెట్లను జారీ చేయడం ఉండదు. రైల్వే స్టేషన్‌కు 40 కి.మీ.ల దూరంలో వందే భారత్ రైలు వచ్చేసిందంటే కరంట్ చార్ట్ ప్రిపరేషన్ జరుగుతుంది. చార్ట్ సిద్ధమైన తర్వాత టిక్కెట్టును పొందలేరు. రైల్వే స్టేషన్‌కు వచ్చి, వందే భారత్ రైలులో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిసినా అప్పటికప్పుడు టిక్కెట్టు కొనలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికి పరిష్కారం చూపుతూ.. సీట్లు ఖాళీగా ఉంటే రైలు వచ్చే ఐదు నిముషాల ముందు కూడా టిక్కెట్లను జారీచేసేలా రైల్వే శాఖ కృషిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టిక్కెట్ల ధరలు తడిసి మోపెడు..



వందే భారత్ రైళ్లలో ఎకానమీ టిక్కెట్ల ధరలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ఏసీ-2 టైర్ రేంజ్‌లో ఉంటాయి. ఇక ఎగ్జిక్యూటివ్ చైర్ టిక్కెట్టు రేట్లు ఏకంగా విమానపు చార్జీని తలపిస్తాయి. కలబురగి నుంచి బెంగళూరుకు వెళ్లాలంటే వందే భారత్ రైల్లో ఎకానమీ టిక్కెట్టు ధర రూ.1,700, ఎగ్జిక్యూటివ్ అయితే రూ.2,700. ఈ రేట్ల కారణంగా 25 శాతం సీట్లు ఖాళీగా ఉంటున్నాయి.

- ప్రశాంత్, చార్టెడ్ అకౌంటెంట్, కలబురగి

రైలు వచ్చే ముందు టిక్కెట్లివ్వాలి



వందే భారత్ రైలుకు సాధారణంగా ఆన్‌లైన్‌లోనే టిక్కెట్టు బుక్ చేసుకుంటుంటారు. అధిక టిక్కెట్టు ధరల కారణంగా చాలా సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. రైలు వచ్చే ముందు టిక్కెట్టు కొందామనుకున్నా సాధ్యపడదు. ఈ రైలులో వెయిటింగ్ లిస్టు ప్రయాణికులకు ప్రవేశం లేనందున సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయి. రైల్వేకి కూడా ఇది నష్టం. చివరి నిమిషంలో టిక్కెట్టు కొని ఈ రైలులో ప్రయాణించే అవకాశం కల్పించాలి.

- రవితేజ, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, బెళుగుప్ప

తూతూమంత్రంగా బదిలీలు

సిఫారసు లేఖలు తూచ్..

హెల్త్ గ్రౌండ్, దివ్యాంగ, స్పౌజ్ రిక్వెస్ట్‌లకు నో చాన్స్

వివాదాస్పదంగా పామిడి, గుత్తి ఏపీఓల నియామకం



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్వో, డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్వామాలో బదిలీలు తూతూమంత్రంగా సాగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి సొంత ప్రణాళికలను డ్వామా అధికారులు అమలు చేశారు. డ్వామాలో కీలకంగా ఉండే హెచ్ఆర్, మరో ద్వితీయ ఉన్నతాధికారి ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా వ్యవహరించారు. గురువారం స్థానిక డ్వామా హాల్‌లో డీఆర్వో మలోల, పీడీ సలీంబాషా ఆధ్వర్యంలో ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ చేపట్టారు. సీనియార్టీ ప్రకారం బదిలీలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, హెల్త్ గ్రౌండ్, దివ్యాంగులు, స్పౌజ్ రిక్వెస్ట్‌లు పరిగణనలోకి తీసుకోలేదనే వాదన వినిపిస్తోంది. పామిడి, గుత్తి ఏపీఓల బదిలీ వివాదాస్పదంగా మారింది.

వినతులు తూచ్..

డ్వామా బదిలీల్లో అనేక వింతలు కనిపిస్తున్నాయి. రిక్వెస్ట్, హెల్త్‌గ్రౌండ్, స్పౌజ్, దివ్యాంగుల వినతులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. గుత్తి, పామిడి ఏపీఓల బదిలీలు వివాదాస్పదంగా మారాయి. యాడికిలో ఉన్న ఏపీఓ రమేష్‌ను గుత్తికి బదిలీ చేశారు. గుత్తిలో ఉన్న మద్దిలేటిని యాడికికి బదిలీ చేశారు. కూడేరు ఏపీఓ తులసిప్రసాద్‌ను పామిడికి పంపారు. పీడీ కార్యాలయంలో ఉన్న ఆదినారాయణమ్మ తాడిపత్రిలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆదినారాయణమ్మను పామిడికి బదిలీ చేస్తున్నామనీ, ఇదివరకు పామిడికి బదిలీ చేసిన తులసిప్రసాద్‌ను గుత్తికి మార్చామని డ్వామా అధికారులు చెప్పడంతో పలువురు ఏపీఓలు వాగ్వాదానికి దిగారు. పామిడి ఎంపీడీఓ... ఏపీఓగా ఆదినారాయణమ్మ వస్తేనే విధుల్లో చేర్చుకుంటాననీ, వేరే వాళ్లు వస్తే వెనక్కు వెళ్లాల్సిందేనని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. గుమ్మఘట్ట ఏపీఓగా పనిచేస్తున్న సురేష్‌కుమార్ నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. తిరిగి అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. అదే క్లస్టర్‌లో పనిచేస్తున్న నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు ఐదేళ్లు పూర్తయినా తిరిగి అదే క్లస్టర్‌లో నియమించడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక డ్వామా పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఐదేళ్లు పూర్తయినా వారిని కదిలించకపోవడం గమనార్హం. హెచ్ఆర్ మేనేజర్ సర్వీస్ ఆరేళ్లు కావస్తున్నా అక్కడే ఉంచడం పట్ల ఉద్యోగుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. బుక్కరాయసముద్రంలో ఉన్న ఏపీఓ పోలేరయ్యను కూడేరుకు, ఉరవకొండ ఏపీఓ విమలను గుంతకల్లుకు, పుట్లూరు ఏపీఓ చెన్నకేశవయ్యను ఆత్మకూరుకు, పెద్దవడుగూరులో ఉన్న ఏపీఓ పుల్లారెడ్డికి తిరిగి అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఏడాదిగా వివిధ ఆరోపణలు ఎదుర్కొంటూ పీడీ కార్యాలయంలో కూర్చుని జీతం తీసుకుంటున్న ఏపీఓలు ఓబిరెడ్డి, విజయభారతిని ఎక్కడా బదిలీ చేయలేదు. అనంతపురం రూరల్ ఏపీఓగా ఉన్న చంద్రకళను తాడిపత్రికి బదిలీ చేశారు.

175 మందికి కౌన్సెలింగ్

డ్వామాలో 175 మంది ఉద్యోగులకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరిలో 11 మంది ఏపీఓలు, 98మంది టీఏలు, 51మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలు ఆన్‌లైన్‌లో బదిలీ కోసం ఆప్షన్ ఇచ్చారు. ఏడుగురు ఏపీఓలు, 98 మంది టీఏలు, 51 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఈసీలను బదిలీ చేశారు. వీటిలో తిరిగి మార్పులు చేర్పులు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

చెరువుకు నీరు.. చేనుకు నారు..

నిండిన బండమీదపల్లి చెరువు

- వ్యవసాయ బోర్లలో పెరిగిన నీరు
- విస్తారంగా పంటల సాగు అన్నదాతల ఆనందం
- వైసీపీ పాలనలో ఐదేళ్లూ అరకొరగా నీరు



నీటితో కళకళలాడుతున్న బండమీదపల్లి చెరువు

రాప్తాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి చెరువుకు ఐదేళ్ల తరువాత జలకళ వచ్చింది. ఊరికి పండగొచ్చింది. హంద్రీనీవా నీటితో చెరువును పూర్తిగా నింపడంతో భూగర్భ జలమట్టం పెరిగింది. వ్యవసాయ బోర్లలో నీరు వస్తోంది. దీంతో రైతులు పంటల సాగుకు ఉపక్రమించారు. విస్తారంగా వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. చెరువు కింద వందల ఎకరాల్లో పచ్చదనం పరచుకుంది. టీడీపీ హయాంలో కాలువ తవ్వి, చెరువుకు నీరు వదిలారు. అప్పట్లో చెరువును పూర్తిగా నింపారు. వైసీపీ అధికారం చేపట్టాక పూర్తిగా నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును పూర్తిస్థాయిలో నింపలేదు. అరకొరగా నీరు వదిలి, మమ అనిపించేవారు. ఆ నీరు చెరువు గుంతల్లోకి కూడా చాలేది కాదు. దీంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోయి, చాలా బోర్లలో నీరు రాకుండా పోయింది. రైతులు చేసేదిలేక పంటల సాగు ఆపేశారు. గతేడాది కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ చెరువుకు జలకళ వచ్చింది. ఈ ఏడాది చెరువును పూర్తిస్థాయిలో నింపడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయి.



చెరువుకు నీటి కరువు

గతేడాది చెరువులో నీరు లేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం



సాగు చేసిన వరి

రూ.కోట్లు ఖర్చు పెట్టి.. కాలువ తవ్వి..

టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు కనగానపల్లి మండలం కోనాపురం సమీపంలోని హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. తద్వారా ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక చెరువుకు నీటి విడుదలపై నిర్లక్ష్యం చూపారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా చెరువును నింపలేదు. దీంతో వ్యవసాయ బోరుబావులు వట్టిపోయి, పొలాలను రైతులు బీడుగా వదిలేయాల్సి వచ్చింది. తాగునీటికీ ఇబ్బందులు తలెత్తాయి. పాడి పెంపకానికి సైతం అన్నదాతలు అవస్థలు పడ్డారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు. దీంతో చెరువు నిండి, కళకళలాడుతోంది. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటంతో దూరప్రాంతాల్లోని రైతుల పొలాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగి విరివిగా పంటలు సాగు చేశారు.

ఎమ్మెల్యే చొరవతోనే చెరువుకు నీరు



టీడీపీ హయాంలో పరిటాల సునీత మంత్రిగా ఉన్నపుడు బండమీదపల్లి చెరువుకు నీరు సరఫరా చేసేందుకు దాదాపు రూ.8కోట్లు ఖర్చు చేసి పిల్ల కాలువ తవ్వారు. ఏటా చెరువు నింపి, మరువ పారించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువుకు నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో గ్రామంలో రైతులు, ప్రజలు.. సాగు, తాగు నీటికి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో చెరువుకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేశారు.

-శ్రీనివాసులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, బండమీదపల్లి

పుష్కలంగా నీరు



గతేడాది చెరువులో నీరు అరకొరగా ఉండడంతో వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గి, రైతులు పంటల సాగుకు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం చెరువు నిండా నీరు ఉండటంతో వ్యవసాయ బోరుబావుల్లో నీరు పుష్కలంగా వస్తోంది. రైతులు విరివిగా పంటలు సాగు చేసుకుంటున్నారు.

- ప్రసాద్, రైతు, బండమీదపల్లి

మగాడ్రా బుజ్జీ..!

సస్పెన్షన్ అయిన చోటికే పోస్టింగ్.. కణేకల్లు మోడల్ స్కూల్‌లో విడ్డూరం



మోడల్ స్కూల్

రాయదుర్గం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో పైరవీలు శృతిమించాయి. పై అధికారుల చేతులు తడిపితే చాలు.. అనుకున్నది సాధించుకోవచ్చని ప్రచారం జరుగుతోంది. నిబంధనలను ఖాతరు చేయకుండా పోస్టింగ్‌లు ఇవ్వడం ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. సస్పెండ్ అయిన వారికి తిరిగి అదే స్థానాన్ని కేటాయించకూడదు. కానీ అక్కడే రీ పోస్టింగ్ ఇచ్చారు. విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో ఇలా చేస్తే.. రికార్డులను తారుమారు చేసే ప్రమాదం ఉంది. తమకు అనుకూలంగా వ్యవహారాన్ని చక్కదిద్దుకునే వీలుంది. కణేకల్లు మోడల్ స్కూల్‌లో సివిక్స్ అధ్యాపకుడు ఆదినారాయణప్పను జూలై 2024లో సస్పెండ్ చేశారు. ఎనిమిది నెలల అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేసి, అక్కడికే పోస్టింగ్ ఇచ్చారు. ఆదినారాయణప్ప అప్పట్లో విధులకు సక్రమంగా హాజరు కాలేదనే ఆరోపణలు వచ్చాయి. దీనికి తోడు దొంగ సంతకాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి పరిస్థితిపై గత ఏడాది జూలై 11న ఆంధ్రజ్యోతిలో 'పెద్ద సారూ యాడున్నాడో..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు, తనిఖీలు నిర్వహించారు. ఆయన వ్యవహారాలపై సమగ్ర నివేదికను పై అధికారులకు సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా ఆదినారాయణపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు. రెండురోజుల క్రితం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆర్జేడీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సాధారణంగా సస్పెన్షన్ ఎత్తివేసిన సమయంలో వేరే ప్రాంతానికి పోస్టింగ్ ఇవ్వాలనే నిబంధన ఉంది. దీన్ని ఏమాత్రం పాటించలేదు. మోడల్ స్కూల్‌లో సస్పెన్షన్‌కు ముందు ఉన్న రికార్డులను తారుమారు చేస్తే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేత ఉత్తర్వుల్లో విచారణ పెండింగ్‌లో ఉన్న విషయాన్ని పొందుపరిచారు. ఇలాంటి సమయంలో అక్కడే పోస్టింగ్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

ఉద్యోగాల కల్పన తరువు..!

- పాలిటెక్నిక్ కోర్సులతో మెండుగా అవకాశాలు
- పెరుగుతున్న డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 11 కళాశాలలు
- తొమ్మిది కోర్సులు.. 2,123 సీట్లు..
- ఏప్రిల్ 15వరకు దరఖాస్తులు



థర్మల్ ఇంజనీరింగ్ ల్యాబ్‌లో శిక్షణ ఇస్తున్న అధ్యాపకుడు

అనంతపురం సెంట్రల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సులు ఉద్యోగాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరి సులువుగా ఉద్యోగాలు సాధిస్తున్నారు. గత ఎనిమిది నెలల్లోనే అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 803 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నూతన ప్రభుత్వం ఏర్పాటుతో కంపెనీల్లో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వాటిలో తొమ్మిది ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు 2,123 మంది విద్యార్థులకు కన్వీనర్ కోటా కింద ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఇందుకు రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కామన్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. పదో తరగతి పరీక్షలు రాస్తూనే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 30న పరీక్ష ఉంటుంది.

రాయలసీమకే తలమానికం

రాయలసీమలోనే ఎక్కడాలేని వర్క్‌షాప్, ల్యాబ్‌లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సొంతం. ఎలక్ట్రికల్ ల్యాబ్, మెకానిక్ షాప్, మెటీరియల్ టెస్టింగ్, స్మితి.. షీట్ మెటల్, ఆటోమొబైల్ ల్యాబ్, థర్మల్ ఇంజనీరింగ్ ఫ్యూయల్ ల్యాబ్, ఎలక్ట్రికల్ వైరింగ్, సాయిల్ మెకానిక్, ఫిట్టింగ్ సెక్షన్, ఫోర్, టూవీలర్ మెకానిక్ తదితర ల్యాబ్‌లున్నాయి. సీమెన్స్ ట్రైనింగ్ సెంటర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూషన్, ఆటోమొబైల్ ఇండస్ట్రీ బేసిక్ టెక్నికల్ కోర్సుల శిక్షణా కేంద్రాలున్నాయి. సాఫ్ట్ స్కిల్స్‌కు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రానిక్ సర్క్యూట్, డిజిటల్ మైక్రో, కమ్యూనికేషన్ మైక్రోవేవ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మూడేళ్ల పాలిటెక్నిక్ కోర్సుల కాలంలో 70 శాతం సమయం ఈ వర్క్‌షాప్, ల్యాబుల్లోనే విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఫలితంగా చివరి సంవత్సరంలోనే ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.

9 కోర్సులు, 2123 సీట్లు...

ఉమ్మడి జిల్లాలోని 11 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తొమ్మిది రకాల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు అందిస్తున్నారు. ఏఐ, ఎంఎల్, ఆటోమొబైల్, సివిల్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈఈఈ, ఈవీ, ఈసీఈ, మెకానికల్, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మొత్తం 2,123 సీట్లు ఉన్నాయి. వాటిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు.



స్మితి ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు



కళాశాలలోని వర్క్‌షాప్, ల్యాబ్స్

8 నెలల్లోనే 800 ఉద్యోగాలు..

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు ఊపందుకున్నాయి. అధికారుల సమాచారం మేరకు గత ఐదేళ్లలో పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు 2020-24 మార్చి వరకు 224 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 2024 జూలై నుంచి 2025 ఫిబ్రవరి వరకు 803 మంది ఉద్యోగాలు సాధించారు. కంపెనీల్లో సానుకూల పరిస్థితులు నెలకొనడాయనడానికి ఇది నిదర్శనం. ప్రముఖ కంపెనీలు.. పాలిటెక్నిక్ విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి.

అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల →



సులువుగా ఉద్యోగాలు



పాలిటెక్నిక్ కోర్సులతో ఉద్యోగాలు సులువుగా పొందవచ్చు. మూడేళ్ల కోర్సు వ్యవధిలోనే ఉద్యోగం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాం. ఆ దిశగా ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాం. ఫలితంగా గత ఎనిమిది నెలల్లోనే 800 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

- జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



రథోత్సవంలో ఎస్పీ రత్న, బ్రహ్మరథోత్సవాన్ని సెల్‌లో బంధిస్తున్న ముస్లిం మహిళ, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న కందికుంట దంపతులు, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, రథంపై దవణం వేస్తున్న భక్తులు

నమో నారసింహా..!

అట్టహాసంగా ఖాద్రీశుడి బ్రహ్మరథోత్సవం

(5వ పేజీ తరువాయి)

బ్రహ్మరథంపై అధిష్టింపజేశారు. తిరువీధుల్లో భక్తులు స్వామివారికి దవణం, మిరియాలు, కాయకర్పూరాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులను అలరిస్తూ..

కిక్కిరిసిన భక్తుల నడుమ రథం ఉదయం 9. గంటలకు చౌక్ వద్దకు చేరుకుంది. అక్కడ చిన్నమొద్దుల తాళ్లు తెగిపోవడంతో దాదాపు గంట పాటు ఆగిపోయింది. ఆ తర్వాత 10 గంటలకు భక్తుల గోవింద నామ స్మరణ నడుమ మహా మంగళహారతి పట్టి.. తిరిగి రథాన్ని ముందుకు కదిలించారు. వెనుక వైపున కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాల భక్తులు తెడ్లు వేస్తూ.. మొద్దులు తొక్కడంతో రథం వేగంగా ముందుకు కదిలింది. శివాలయం వద్దకు ఉదయం 11.30 గంటలకు రథం చేరుకుంది. అక్కడ వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గండిబండ అంజనేయస్వామి వద్దకు రథం 12 గంటలకు చేరుకుంది. అక్కడ నుంచి పడమర రాజగోపురం వద్దకు 12.30కు చేరుకుంది. అక్కడ రథంపై శ్రీవారు మరొకసారి పూజలు అందుకున్నారు. స్వామివారి రథం పైకి భక్తాదులు దవణం, మిరియాలు చల్లుతూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. గొల్ల మంటపం వద్దకు సరిగ్గా మధ్యాహ్నం 12.45 గంటలకు రథం చేరుకుంది. అక్కడ 10 నిమిషాలు గడిపిన అనతరం 12.50కి రథం ముందుకు కదిలింది. దవణ మండపం వద్ద అనవాయితీగా ఆగింది. మంగళ మహాహారతి ఇచ్చిన అనంతరం ఎటువంటి ఆటంకాలు లేకుండా మధ్యాహ్నం 1.40 గంటలకు హిందూపురం క్రాస్ చేరుకుంది. అక్కడ రథం కుడివైపు మోకు తెగిపోవడంతో దాదాపు గంటన్నర పాటు నిలిచిపోయింది. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు భక్తుల గోవింద నామస్మరణతో రథం ప్రారంభమైంది. యువకులు రెట్టించిన ఉత్సాహంతో రథాన్ని లాగారు. మధ్యాహ్నం 3.56 గంటలకు రథం యధాస్థానానికి చేరుకుంది. రథోత్సవం దాదాపు 7.40 గంటల పాటు కొనసాగింది.

హాజరైన ప్రముఖులు

రథోత్సవానికి ముందు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి తదితరులు రథం పై ఉండి భక్తులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రథోత్సవంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, రాయలసీమ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రథోత్సవం ముగిసిన తరువాత రథం వెనుక మొద్దులు తొక్కిన కుటాగుళ్ళ, మూర్తిపల్లి, గజ్జలరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులకు శ్రీవారి మొదటి దర్శనం కల్పించారు.

భక్త జనసంద్రం

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వీక్షించడానికి తరలివచ్చిన భక్తులతో కదిరి వీధులన్నీ బుధవారం రాత్రి నుంచే కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో కాలు మోపడానికి కూడా వీలులేకపోయింది. రథంపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడిని దర్శించుకోవడానికి భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. నిప్పులు చెరిగే ఎండను సైతం లెక్కచేయకుండా మిద్దెలు ఎక్కారు. రోడ్లపై నిలబడ్డారు. 'నాలుగు గోపురాల వాడా.. గోవిందా.. లక్ష్మీ నారసింహా.. గోవిందా' అంటూ రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. తేరుపై దవణం, మిరియాలు చల్లారు. రథ చక్రాల క్రింద గుమ్మడికాయలు ఉంచారు. రథం పై నుంచి జాలువారిన మిరియాలను ఏరుకునేందుకు ప్రయత్నించారు. తిరుగు ప్రయాణంలో కదిరి కుంకుమ, దవణం, తినుబండారాలు, ఆట వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేశారు. దుకాణాలు కిటకిటలాడాయి. యువతీ యువకులు రథోత్సవాన్ని సెల్‌ఫోన్‌లలో బంధించారు. సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవం ముగిసిన తర్వాత ఆలయంలో శ్రీవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. పలువురు భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి, భృగుతీర్థంలో స్నానాలు ఆచరించి, శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రసాదాల కొనుగోలు కోసం భక్తులు బారులు తీరారు. చాలా మంది పచ్చబొట్లు వేయించుకోవడానికి బారులు తీరారు.

పటిష్ట బందోబస్తు

రథోత్సవం సందర్భంగా అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బంది, పారామిలటరీ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. బుధవారం రాత్రి నుంచే వాహనాలను దారి మళ్లించారు. హిందూపురం, బెంగళూరు వైపు బస్సులను కదిరి శివారులోనే నిలిపివేసి, అక్కడే తాత్కాలిక బస్టాప్ ఏర్పాటు చేశారు. క్లాక్ టవర్, కోనేరు, జీవిమాను సర్కిల్, వలిసాబ్ రోడ్డులో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. తిరువీధుల్లోకి వాహనాలు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఎస్పీ రత్న రథోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి దవణం సమర్పించారు.

యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అందజేసే ప్రధానమంత్రి యోగా అవార్డు-2025కి అర్హులైన అభ్యర్థులు, సంస్థలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమ శాఖాధికారి వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. యోగా ప్రచారం, అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు కనీసం 20ఏళ్లుగా యోగా సేవలో ఉంటూ, వయసు 40ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు, సంస్థలు ఈనెల 31వ తేదీలోపు http:///innovateindia.mygov.in/pmyogaawards2025 వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9959517370 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కార్బైడ్ వినియోగిస్తే చర్యలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పండ్ల వ్యాపారులు కాల్షియం కార్బైడ్ ఉపయోగించి కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆహారభద్రత శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. కార్బైడ్ ఉపయోగించిన పండ్లను విక్రయిస్తే ఆరు నెలలు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. పండ్ల వ్యాపారులు సహజ సిద్ధంగా మాగిన పండ్లను విక్రయించాలన్నారు.

ఏప్రిల్ 27న బీసీ గురుకులాల ప్రవేశ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జొనాథన్ గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఎక్కువ వస్తున్న నేపథ్యంలో మరో ఏడు పరీక్షా కేంద్రాలను పెంచామన్నారు. గతంలో నాలుగు ఉండగా పెంచిన వాటితో కలిపి ఆ సంఖ్య 11కి చేరిందన్నారు. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ఈనెల 22తో ముగియనున్న దరఖాస్తు గడువును 25వ తేదీ వరకూ పొడిగించామన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866559653, 9052316764 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

యాడికి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష రాయడానికి వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. ఇంటికి తిరిగి రాకపోవడంపై విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఈనెల 17న పరీక్ష రాయడానికని చెప్పి ఇంటి నుంచి అనంతపురం బయల్దేరి వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్కేయూలో విద్యార్థుల గొడవ

16 మందిపై కేసు నమోదు

అనంతపురం క్రైం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో న్యాయ, ఎంబీఏ విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. పరస్పరం దాడి చేసుకోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన 16 మంది విద్యార్థులపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు, బుధవారం రాత్రి 11గంటల సమయంలో ఎంబీఏ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు తమ వసతి గృహంలో ఫ్రెషర్స్ పార్టీ జరుపుకుంటున్నారు. లా స్టూడెంట్ విశ్వరూపాచారి అక్కడికి వెళ్లి వీడియోలు తీయడం ప్రారంభించాడు. ఎంబీఏ విద్యార్థులు ప్రశ్నిస్తే.. ఇక్కడ ర్యాగింగ్ జరుగుతోందని తెలిసి వీడియో తీస్తున్నానని అన్నాడు. ర్యాగింగ్ జరగడం లేదని, ఫ్రెషర్స్ పార్టీ చేసుకుంటున్నామని, వీడియోలు తీయవద్దని సూచించారు. ఈ క్రమంలో గొడవ మొదలైంది. అదే సమయంలో లా విద్యార్థులు భరత్ కుమార్ రెడ్డి, మరికొందరు అక్కడికి వచ్చారు. రెండు వర్గాలు కలబడ్డాయి. గొడవలో భరత్‌కుమార్ రెడ్డి, నరేష్, నాయక్ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో తొమ్మిది మంది లా విద్యార్థులు, ఏడుగురు ఎంబీఏ విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

ఈకేవైసీ చేయించుకున్న వారికే రేషన్: జేసీ

అనంతపురం టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకుంటేనే సరుకులు అందుతాయని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రేషన్‌కార్డులో ఎంతమంది సభ్యులుంటే అందరూ ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఇంకా కొందరు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. అలాంటివారు నెలాఖరులోగా రేషన్‌షాపు, గ్రామరెవెన్యూ అధికారి, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వద్దకెళ్లి ఈకేవీసీ చేయించుకోవాలని జేసీ కోరారు.

ఐపీ పెట్టిన దళారీ నిర్బంధం

పోలీసుల జోక్యంతో విడుదల

కణేకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పంట విక్రయించిన సొమ్ము ఇవ్వకుండా ఐపీ నోటీసులు పంపిన దళారీ, అతడి కుమారుడిని మండలంలోని హనకనహాళ్ గ్రామంలో రైతులు గురువారం నిర్బంధించారు. మండలంలోని హనకనహాళ్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పలువురు రైతుల నుంచి దాదాపు రూ.3కోట్ల విలువ చేసే పప్పుశనగ కొనుగోలు చేశాడు. ఏడాది క్రితం రైతులు డబ్బు అడగ్గా.. అతడు గ్రామం విడిచి వెళ్లిపోయాడు. తరువాత రైతులకు ఐపీ నోటీసులు పంపించాడు. కొన్నిరోజుల తర్వాత గ్రామానికి వచ్చిన కృష్ణారెడ్డి, అతడి కుమారుడు సోమశేఖర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పలు దఫాలు రైతులు, దళారీతో చర్చించి కోటి రూపాయల మేర చెల్లించేలా ఒప్పందం కుదిర్చారు. ఆ సొమ్ము కృష్ణారెడ్డి ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన హనకనహాళ్, బెళుగుప్ప తదితర గ్రామాలకు చెందిన రైతులంతా కృష్ణారెడ్డి ఇంటికి చేరుకుని అతడితోపాటు కుమారుడిని గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి, కూర్చోబెట్టారు. డబ్బు చెల్లించే వరకు ఇక్కడి నుంచి వెళ్లరాదని స్పష్టం చేశారు. రైతులు కూడా అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది గ్రామానికి చేరుకుని రైతులు, దళారీతో చర్చించారు. వచ్చే నెలలో డబ్బు చెల్లిస్తానని దళారీ చెప్పడంతో పోలీసులు సర్దిచెప్పారు. దీంతో వారు వెళ్లిపోయారు.

టమోటా కిలో రూ.8

అనంతపురం రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 125 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 6 పలికినట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ద్వారా మిమ్ములను అభిమానించే వారికి శ్రేయోభిలాషులకు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేయండి.
Advertisements
జన్మదిన వేడుకలు
వివాహ శుభాకాంక్షలు
విదేశీయాన శుభాకాంక్షలు
స్వదేశాగమన శుభాకాంక్షలు
ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు
మొదలగు అన్ని రకముల పత్రికా ప్రకటనలకు మీ ఏరియాలోని మా ప్రతినిధిని సంప్రదించండి
యాడ్స్ డిపార్ట్‌మెంట్ : 99854 11165, 99854 11179, 9900167475,
ప్రతి ప్రకటనలపై GST 5% వర్తించబడును.
అనంతపురం : 99854 10956, 99854 01208, 99854 01251, 99854 03749, 77804 27767
గుంతకల్లు : 89195 18075,
హిందూపురం : 97036 18698,
లేదా మీ సమీప ఆంధ్రజ్యోతి ఏజెంటును సంప్రదించండి.



మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వర్గీకరణకు ఆమోదంపై సంబరాలు

అనంతపురం టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టానికి గురువారం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆమోదం తెలపడంపై మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) నేతలు సంబరాలు చేసుకున్నారు. చట్టానికి ఆమోదం తెలిపిన వెంటనే జిల్లాకేంద్రంలోని జిల్లాపరిషత్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు పెద్దఎత్తున మాదిగ ఉద్యోగులు తరలివచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చడం పట్ల స్వీట్లు పంచుకుని, సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్, నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

30 ఏళ్ల కల సాకారం

టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

అనంతపురం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీతో ఆమోదం తెలపడం ద్వారా 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నాయుడు సాకారం చేశారని టీడీపీ ఎస్సీ సెల్, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు వన్నూరప్ప, వెంకటేష్, కదిరప్ప, ఎమ్మార్పీఎస్ నేత చెన్నకేశవులు గురువారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు తీసుకున్నారు..

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య



ఓబునాథ్ (ఫైల్)

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల గురువారం ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించిందని పట్టణంలోని గిర్రాజు కాలనీలో ఓబునాథ్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గిర్రాజు కాలనీకి చెందిన దీనబంధు కుమారుడు ఓబునాథ్ టైల్స్ పనికి వెళ్తుండేవాడు. ఓ అమ్మాయిని ప్రేమించాడు. పెళ్లికి ఆ అమ్మాయి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓబునాథ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బయటకు వెళ్లిన కుటుంబసభ్యులు కాసేపటికి వచ్చి చూడగా.. ఓబునాథ్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఓబునాథ్ తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి యువకుడు..

అనంతపురం న్యూటౌన్(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ సెకండ్ క్రాస్‌కు చెందిన అమ్మినేని తరుణ్‌కుమార్ (28) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక మారుతీ నగర్ సమీపంలో రైలు పట్టాలపై గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని శవం రైలు పట్టాలపై ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ వెంకటేష్ వెళ్లి, పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాల ప్రకారం అతడు అశోక్‌నగర్ సెకండ్ క్రాస్‌కు చెందిన అమ్మినేని వెంకటనాయుడు, రమాదేవి దంపతుల కుమారుడు తరుణ్‌కుమార్‌గా గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు ప్రమాద స్థలానికి చేరుకుని, విలపించారు. ఎంబీఏ వరకు చదివిన తరుణ్ కుమార్ వ్యసనాలకు బానిసై, ఇంట్లో వారితో తరచూ గొడవ పడుతుండేవాడు. బుధవారం రాత్రి కూడా వారితో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బూదిలిలో యువతి..



విమల (ఫైల్)

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన విమల (24) గురువారం ఇంట్లోనే ఉరేసుకుని, ప్రాణం తీసుకుంది. బూదిలికి చెందిన నరసింహులు, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. విమలను చిన్నప్పటినుంచి బూదిలిలోనే ఉంటున్న మేనత్త, మేనమామ కిష్టప్ప, నాగలక్ష్మి పెంచుకుంటున్నారు. విమల తల్లిదండ్రులు బెంగుళూరుకు వలస వెళ్లి అక్కడే ఉంటున్నారు. విమల డిగ్రీ పూర్తి చేసి, గోరంట్లలోని ఎమ్మార్సీలో దివ్యాంగురాలైన టీచర్ నిర్మలకు సహాయకురాలిగా వ్యవహరిస్తుండేది. రోజూ పాఠశాలకు వెళ్లి వచ్చేది. ఈ నేపథ్యంలోనే గురువారం మేనత్త ఇంట్లో పైకప్పునకు చీరతో ఉరేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి, గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే యువతి మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉంది. బెంగళూరు నుంచి వచ్చిన తల్లి నారాయణమ్మ.. అనారోగ్య కారణాలతోనే విమల ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఐ శేఖర్ కేసు నమోదుచేసి, యువతి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

గుత్తి, మార్చి20(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని యువకుడు రాజశేఖర్(28) మృతిచెందాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జక్కలచెరువు ఆర్ఎస్‌కు చెందిన రాజశేఖర్ భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి బయటకు వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లాడు. మద్యం మత్తులో రైల్వే ట్రాక్ దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. రాజశేఖర్‌కు ఇద్దరు కూమారైలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అణగారిన కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాల్లో చేర్చాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లుటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): అణగారిన కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డిమాండ్ చేశారు. సీపీఐ స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మదాసి/మదారి కురుబ కులాన్ని 1956లోనే ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. రాష్ట్ర ఎస్సీ జాబితాలో 31వ వరుస సంఖ్యలో మదాసి కురువ కులం ఉన్నా.. సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాలను జారీచేసే అధికారాన్ని ఆర్డీవో నుంచి తహసీల్దారుకు బదలాయించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే బోయలను ఎస్టీ జాబితాలోకి, బేడ బుడగజంగం, చాకలి కులాలను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కులాలన్నింటినీ పలు రాష్ట్రాలు, కేంద్రం ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించాయన్నారు. ఈ డిమాండ్‌పై ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు



రైల్వే ట్రాక్ నుంచి మహిళను తీసుకొస్తున్న సీఐ

హిందూపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకున్న మహిళను పురం పోలీసులు రక్షించారు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేపాక్షి గ్రామానికి చెందిన మీనాక్షి భర్త ప్రమాదంలో మరణించాడు. అతడి బీమా డబ్బు తనకివ్వకుండా కుటుంబ సభ్యులే వాడుకున్నారని మీనాక్షి ఆరోపించింది. పలుసార్లు డబ్బు అడిగినా ఇవ్వకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. హిందూపురంలో రైలు పట్టాలపైకి వెళ్లి తల్లికి ఫోన్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చింది. వెంటనే ఫోన్ స్విచాఫ్ చేసింది. కుటుంబ సభ్యులు లేపాక్షి పోలీసులకు సమాచారం అందించారు. వారు సీఐ అంజనేయులుకు చెప్పారు. చివరగా మాట్లాడిన ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా హుటాహుటిన రైలు పట్టాల వద్దకెళ్లి మహిళను గుర్తించారు. ఆత్మహత్య ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

విద్యార్థిని పట్ల అసభ్య ప్రవర్తన కేసు..

ముద్దాయికి 20 ఏళ్ల జైలు

అనంత పోక్సో కోర్టు సంచలన తీర్పు

కదిరి లీగల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించి, గాయపరచిన ఆటో డ్రైవర్ చిరంజీవికి అనంతపురం జిల్లా పోక్సో కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. రూ.వెయ్యి జరిమానా, రూ.3లక్షల పరిహారాన్ని చెల్లించాలని న్యాయాధికారి రాజ్యలక్ష్మి ఆదేశించారు. కదిరి సీఐ నారాయణరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. 2019 మార్చి 17న కదిరి మున్సిపాలిటీ పరిధిలోని ఓ పల్లెకు చెందిన విద్యార్థిని ఒంటిపూట బడి ముగించుకుని ఇంటికి వెళ్లడానికి వేచి ఉంది. ఆ బాలిక, మరో బాలుడిని గమనించిన నీటి సరఫరా చేసే ఆటో డ్రైవర్ చిరంజీవి, ఇంటివద్ద దింపుతానని నమ్మబలికాడు. బాలుడిని ఆటో పక్కన, బాలికను తనమీద కూర్చోబెట్టుకున్నాడు. ఈ క్రమంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. భయపడిన బాలిక, బాలుడు కేకలు పెట్టారు. దీంతో వారిని ఆటో నుంచి దింపేసి చిరంజీవి పారిపోయాడు. విషయం తెలుసుకుని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ వేశారు. అనంత పోక్సో కోర్టు విచారణ చేపట్టింది. సాక్ష్యాధారాల పరిశీలన, వాదోపవాదనలు విన్న అనంతరం న్యాయాధికారి తీర్పు వెలువరించారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA-226980

CHANGE OF NAME
★ I, ROOPA SABBANAHALLI, (old name) W/o. NARENDRA MASUPALLI, R/o. D.No. 20/696-1, Lonikota Street, Dharmavaram, Sri Satya Sai District (AP) - 515671, have changed my name as ROOPA SHREE (new name) W/o NARENDRA MASUPALLI. Hereafter my name is known as ROOPA SHREE W/o NARENDRA MASUPALLI for all purposes. AJH-47188

CHANGE OF NAME
★ I, PULLAGURA VENKATA SUBBALAKSHMI, W/o PULLA BRAMHA NANDA, Resident of 2-62, Pamidi Road, BC-Colony, Village & P.O - Nagasamudram, District - Anantha puram, Andhrapradesh-515401, have changed my Name to PULLA MAHALAKSHMI AJH-47413

WANTED
Wanted / Assistant Manager for Anantapur Biggest Furniture Show Room "Mamatha Furniture" Salary Rs.20,000 + Incentive Requirments. Education: Degree / 2 Years Retail Experience/ Basic Computer Skills. Interview Date& Time: 20 & 21 March 11:00 AM - 5:00 PM. Address: గుత్తి రోడ్డు మార్కెట్ యార్డ్ ఎదురుగా, అనంతపురం.
AJA-226917

WANTED TECHNICAL PERSONS
Evaluators for purchase of used cars. Candidates with Prior experience / Freshers (ITI / Diploma / Degree) / Service Advisors (4 W) may apply. 4W Driving License is compulsory. Cont:8333929186.
AJA-727

గాయత్రి జ్యోతిష్యం
పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926
AJA-226982

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సహర్ (శనివారం ఉదయం)
కదిరి:	6.31	5.05
ధర్మవరం:	6.36	5.05

రథోత్సవంలో అడుగడుగునా ఆతిథ్యం


రథోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న స్థానికులు, వ్యాపారులు

కదిరి/అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మ రథోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు పట్టణంలో అడుగడుగునా అతిథ్యం లభించింది. పట్టణంలో ఎక్కడ చూసినా అన్నదానం, నీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు, అరటి పండ్లను దాతలు అందించారు. పిలిచిమరీ వడ్డించారు. దుకాణదారులు వారి దుకాణాల ముందు అన్నదానం చేశారు. స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హరి ప్రసాద్, డిప్యూటీ మేనేజర్ వెంకట్, బ్యాంక్ సిబ్బంది సిద్దిక్, కొమ్ము విజయభాస్కర్ పాల్గొన్నారు. పట్టణవాసుల ఔదార్యానికి భక్తులు పులికించారు. రథం లాగే భక్తులకు మిద్దెలపై నుంచి వాటర్ ప్యాకెట్లు అందించారు.

● అధికారుల బాధ్యతా రాహిత్యం

బ్రహ్మరథోత్సవంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. సాధారణంగా ఐదు గంటల్లో ముగిసే రథోత్సవం ఈ సంవత్సరం దాదాపు ఏడు గంటలకుపైగా పట్టింది. ఇందుకు అధికారుల నిర్లక్ష్యం, బాధ్యత రాహిత్యమే ప్రధానంగా కనిపిస్తోంది. హిందూపురం సర్కిల్‌లో రథం గంటన్నరకు పైగా ఆగిపోయింది. దీనికి కారణం


విరిగిన నిచ్చెన


తెగిపోయిన మోకు

రథానికి కుడివైపున ఉండే మోకు తెగిపోవడమే. సంవత్సరానికి ఒక్కసారి నిర్వహించే బ్రహ్మరథోత్సవంలో అధికారులు అన్ని ముందుగా పరిశీలించుకోవాలి. ఏకంగా మోకు తెగిపోవడం అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యత రాహిత్యానికి అద్దం పడుతోంది. దీనికితోడు రథోత్సవం అనంతరం రథంలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం కల్పిస్తారు. రథం పైకి వెళ్లడానికి 15 సంవత్సరాల క్రితం బలమైన నిచ్చెన్లు తయారుచేశారు. గురువారం మధ్యాహ్నం రథోత్సవం అనంతరం వాటిని అమర్చగా, ఒకటి ఉన్నఫలంగా విరిగిపోయింది. దీంతో రథంపైకి వెళ్లడానికి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల ముందుచూపులేని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని భక్తులు మండిపడ్డారు. బ్రహోత్సవాల్లో ముందుజాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే రథోత్సవం ఆలస్యమైందని భక్తులంటున్నారు. వాస్తవానికి మలుపుల్లో వేసే ఇసుక మదం ఎక్కువ అవడం వల్లే రథం మలుపుల్లో తిరగలేకపోయిందని, రథం నడిపే నిపుణులంటున్నారు. దీనికి కూడా అధికారులు పరిశీలించిన పాపాన పోలేదని భక్తులం టున్నారు.

● భక్తుల నిలువు దోపిడీ

బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులను ఆలయం వద్ద ఉన్న వ్యాపారులు అధిక రేట్లతో నిలువు దోపిడీ చేశారు. సెల్‌ఫోన్, బ్యాగులు ఉంచే క్లాక్ రూం వద్ద మూడింతలు అధిక ధరలు వసూలు చేసినట్లు భక్తులు వాపోయారు. బ్యాగుకు రూ.10 వసూలు చేయాల్సి ఉండగా రూ.40 .. సెల్‌ఫోన్‌కు రూ.5 ఉండగా.. రూ.20, చెప్పులజతకు రూ.5కుగాను రూ.20 వసూలు చేసినట్లు భక్తులు వాపోయారు. తలనీలాల వద్ద రూ.150 తక్కువ కాకుండా వసూలు చేసినట్లు చెప్పారు.



జీవితం.. ఓ రథయాత్ర

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మానవ జీవితమే .. బ్రహ్మరథమని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకుడు అంజనకుమార్ ఆచార్యులు అభిప్రాయపడ్డారు. బ్రహ్మరథం తిరుమాడ వీధుల్లో ఏ విధంగా తిరిగి యథాస్థానానికి చేరుతుందో.. అదే విధంగా మానవ జీవితం కూడా బాల్యం, కౌమార, యవ్వనం, వృద్ధాప్య దశ మరణం అనంతరం మళ్లీ బాల్యంతో మానవ జీవితం మొదలవుతుందన్నారు. మానవుని హృదయంలో దేవదేవుడు కొలువైతే మానవుని జీవితం పరిపూర్ణమవుతుంది. రథయాత్ర సమయంలో ఎన్ని శ్రమలకు ఓర్చి యథాస్థానం చేరుతుందో, అలాగే మానవుని జీవితంలో భగవంతుడు తోడుంటే నాలుగు దశలోనూ శ్రమలకు ఓర్చి.. ముక్తి పొందుతారని పేర్కొన్నారు. రథానికి ఉన్న రెండు మోకులు పగలు.. రాత్రి లాంటివని, అలాగే రథానికి ఉన్న ఆరు చక్రాలు మానవునిలో కామ, క్రోధ, లోభ, మద, మత్సరం, అహకారం లాంటివని అన్నారు. వాటిని జయిస్తే మానవులకు ముక్తికి కలుగుతుందన్నారు. వేలాదిమంది భక్తులు రథాన్ని లాగే సమయంలో ఒక్కొక్కరికి ఒక ఆలోచన ఉంటుందని, అయితే అందరి ఆలోచన ఒకటే సంకల్పమై రథాన్ని ముందుకు తీసుకెళ్లతారని అన్నారు. అలాగే మానవుని మెదడులో అనేక ఆలోచనలు ఉన్నా.. భగవంతుని సంకల్పంతో ముందుకెళ్తే ముక్తి మార్గాం చేరుతారని చెప్పారు. మానవుని ఆలోచనలో సంకల్ప బలం తగ్గితే ఏ విధంగా రథం ఆగుతుందో, మానవుడు కూడా ఆగిపోతాడని చెప్పారు. తిరిగి దైవ నిర్ణయంతో ముందుకు రథంలా కదులుతారన్నారు. రథం 365 రోజులు నిశ్చల స్థితిలో ఉండి, తిరిగి నాలుగు మాడవీధుల్లో తిరిగే సమయంలో బలిహారం, శాంతి, హోమాలు పూజ కార్యక్రమాలు నిర్వహించిన తరువాత రథం కదులుతుందన్నారు.

న్యూస్ బాక్స్

కొత్తచెరువు సీఐ వీఆర్‌కు..

కొత్తచెరువు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ ఇందిర అనంతపురం వీఆర్‌కు బదిలీ అయ్యారు. విషయాన్ని ఎస్పీ రత్న గురువారం ప్రకటనలో తెలిపారు.

ఓటరు జాబితాపై సమావేశం

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్ గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాను తప్పులు లేకుండా తయారు చేయడానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సకరించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి పురుషోత్తంగౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, జనసేన పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, వైసీపీ నాయకుడు సాయికుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, సీపీఎం నాయకులు మారుతి పాల్గొన్నారు.

మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వండి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం నుంచి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, దివ్యాంగులకు, 58 సంవత్సరాలు నిండినవారికి, మానసిక రుగ్మత పిల్లలున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ధర్మవరం ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ కిష్టప్పకు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, అంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, మల్లేశ్, అమర్నాథ్‌రెడ్డి, రామాంజినేయులు, సకలచంద్రశేఖర్, సురేశ్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఆందోళన చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్

పుట్టపర్తి టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని మీటర్ రీడర్స్‌తో కలిసి పుట్టపర్తి ఎస్పీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అంజినేయులు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయడం వలన వేలాది మంది ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. వీరందిరికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, జిల్లా అధ్యక్షులు షాన్వాజ్, రాఘవరెడ్డి, బాబా, రవి, పలువురు మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను సీపీఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఆలకుంట్ల మారుతి, అయూబ్‌ఖాన్ గురువారం పరిశీలించారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్లు, డ్రైనేజీ పనులు దారుణంగా ఉన్నాయన్నారు. ఈ ఇళ్లకు వాడిన సామగ్రి అంతా నాసిరకంగా ఉందని , అప్పుడే గోడలకు పగుళ్లు వచ్చాయని అన్నారు. అనంతరం ఎల్-4, ఎల్-3 కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు, వీధి కుక్కల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రజా సమస్యలపై ఈనెల 25న జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని, కావున సీపీఎం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని సీపీఎం నాయకులు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, నారాయణస్వామి పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ గురువారం తనిఖీ చేశారు. ఖైదీల వివరాలను సబ్‌జైలు సూపరింటెండెంట్ కెవీ బ్రహ్మంరెడ్డిని అడిగితెలుసుకున్నారు.అనంతరం ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ఎవరికైనా ఖైదీలకు ఆర్థిక స్థోమత లేకపోతే.. వారికి న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట న్యాయవాదులు నూర్ మహమ్మద్, బాల సుందరి, షామీర్ బాషా ఉన్నారు.


సబ్‌జైలులో తనిఖీ చేస్తున్న శివప్రసాద్ యాదవ్


విజయవాడలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మంత్రి సత్యకుమార్, క్రీడల్లో ప్రతిభ కనబరచిన ఎమ్మెల్యే సింధూరారెడ్డికి ట్రోఫీ అందజేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అక్రమ భవనాలను ఎందుకు కూల్చరు?: సీపీఐ

ముదిగుబ్బ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కన సహకార సొసైటీ స్థలంలో అక్రమంగా నిర్మించిన భవనాల కూల్చివేతకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ప్రశ్నించారు. గురువారం సీపీఐ నాయకులు ఆధ్వర్యంలో సహకార సొసైటీ స్థలం కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సొసైటీ సీఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణం గల సొసైటీ స్థలాన్ని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో ఒక మూలన ఇటీవల అక్రమంగా నిర్మించారని ఒక చిన్న రేకుల షెడ్డును రెండురోజుల కిందట కూల్చివేసిన అధికారులు, జాతీయ రహదారి పక్కన ఎంతో విలువ చేసే సొసైటీ స్థలంలో అక్రమంగా నిర్మించిన పెద్ద భవనాలను కూల్చివేయడానికి ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు కొంతమంది అక్రమ కట్టడాల నిర్మాణం పై హైకోర్టును ఆశ్రయించినా.. నేటికి ఎటువంటి ప్రయోజనం లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సొసైటీ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సౌత్ స్టేట్స్ గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి, సీపీఐ నాయకులు తిప్పయ్య, నాయుడు, చిన్నప్ప, ఈశ్వర్ నాయక్ పాల్గొన్నారు.


సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి


ధర్నా నిర్వహిస్తున్న ప్లంబర్లు, సీపీఐ నాయకులు

ధర్మవరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలో 650-2లో అర్హులైన ప్లంబర్స్‌కు పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అనర్హుల పట్టాలను తొలగించి అర్హులైన ప్లంబర్ కార్మికులకు ఇవ్వాలని, లేకుంటే ఈనెల 24న ధర్నా చేపడుతామని అన్నారు. 850-2లో అక్రమాలపై విచారణ చేపట్టి అనర్హులుగా తెలితే వాటిని కూడా రద్దు చేయాలన్నారు. డీటీ సురేశ్‌బాబు మాట్లాడుతూ.. పూర్తీ విచారణ అనంతరం అర్హులైన ప్లంబర్స్‌కు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, సంఘం అధ్యక్షుడు రాజు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజ్, చిన్నా పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ముదిగుబ్బ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మందులు, వస్త్ర, కిరాణ దుకాణదారులు, చికెన్ సెంటర్ నిర్వాహకులకు స్థానిక గ్రామ సచివాలయ కార్యాలయంలో అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకంపై కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి మంజుల, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

ధర్మవరం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదంపై తెలపడంపై టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల కల నెరవేరినందుకు మాదిగల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

రాయితీపై అదనపు లోడు క్రమబద్ధీకరణ

- **50 శాతం డెవలప్‌మెంట్ చార్జీల తగ్గింపు**
- **జూన్ 30 వరకు అవకాశం**

కదిరిఅర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పద్ధతిలో భాగంగా పెరిగిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని, గ్రామ, మండల కేంద్రాలు, పట్టణ పరిధిలో మూడు కిలోవాట్లకు దరఖాస్తు చేసుకునేలా ముందుగానే సంబంధిత విద్యుత్ అధికారులు వినియోగదారులకు సూచిస్తున్నారు. గతంలో కొంతమంది వినియోగించుకుంటున్న దానికంటే తక్కువ లోడ్ చూపుతూ కనెక్షన్లు తీసుకున్నారు.


కదిరి విద్యుత్ కార్యాలయం

● అదనపు లోడ్ అంటే..

కొత్తగా కనెక్షన్ తీసుకునే సమయంలో గృహోపకరణాలు వినియోగాన్ని అంచనా వేసి, కిలో వాట్లలో లెక్కిస్తారు. ఆ మేరకు డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడ్‌తో కనెక్షన్ తీసుకుంటే, డెవలప్‌మెంట్ చార్జీలు రూ. రెండువేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. రెండు వందలు చెల్లించాలి. అదే రెండు కిలోవాట్లకు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. నాలుగువేలు కట్టాలి, గ్రామ, మండల కేంద్రాల్లో కనీసం రెండు సింగల్ వాట్లు, పట్టణాల్లో మూడు కిలోవాట్ల దరఖాస్తు చేసేలా ముందుగానే సంబంధిత ఏఈఓలు, లైన్‌మ్యాన్లు వినియోగదారులకు సూచిస్తున్నారు. చాలామంది కనెక్షన్ తీసుకున్నారు. ఏసీలు, హీటర్లు బిగించుకుంటారు. ఫలితంగా లోడ్ రెట్టింపు అవుతుంది. ఆ ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతుంది. ఈ సందర్భంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, ఫీజులు పోవడం తదితర సంఘటనలు జరుగుతాయి.

● జూన్ 30వరకు అవకాశం:

అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పుడు 50శాతం రాయితీ ఇస్తున్నారు. కిలో వాటుకు రూ.రెండువేలకు బదులు రూ. వెయ్యి చెల్లిస్తె సరిపోతుంది. ఈ అవకాశం జూన్ 30వరకు ప్రభుత్వ కల్పించింది. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో లేదా విద్యుత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోండి



కొన్నిసంవత్సరాల క్రితం కనెక్షన్ తీసుకున్నవారికి వినియోగం అప్పటితో పోల్చితే మూడు, నాలుగు రెట్లు పెరిగింది. అదనపు లోడ్‌తో సమస్య నెలకుంటోంది. తనిఖీల సమయంలో అధిక లోడు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే, జరిమానాలు విధిస్తారు. వినియోగదారులు ముందుకొచ్చి, సర్వీసును క్రబద్ధీకరించుకోవాలి. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

-మోసెజ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కదిరి

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో బళ్లారి వాసి మృతి


కేతప్ప మృతదేహం

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని రాట్నాపల్లి సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని బళ్లారి వాసి కేతప్ప (60) మరణించాడు. అతను కాలినడక తిరుమలకు బయలుదేరాడు. నల్లచెరువు మండలంలోని రాట్నాపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడిక్కడే మరణించాడు. ఏఎస్ఐ షేక్షావలీ మృతుని బ్యాగును పరిశీలించాడు. అందులోని ఆధార్‌కార్డు ఆధారంగా అతను బళ్లారివాసి కేతప్పగా గుర్తించారు. అందులో ఉన్న ఫోన్‌నెంబర్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పోక్సో కేసులో ఐదుగురికి రిమాండ్

బత్తలపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఐదుగురు యువకులకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ.. ధర్మవరం కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ సోమశేఖర్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన మారుతిప్రసాద్ ఓ బాలికకు మాయమాటలు చెప్పి.. ఈ నెల 15న బెంగళూరుకు తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఆ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బెంగళూరులో ఉన్న వారిద్దరినీ పోలీసులు ఇక్కడికి బుధవారం తీసుకొచ్చారు. మారుతిప్రసాద్‌కు సహకరించిన పోట్లమర్రి గ్రామానికి చెందిన జనార్దన్, గోరంట్లకు చెందిన నరేంద్ర, రేగాటిపల్లికి చెందిన రవితేజ, బెంగళూరులో ఆశ్రయం ఇచ్చిన బాబుపై పోక్సో చటం క్రింద కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

తనకల్లు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరాకువండ్లపల్లి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తనకల్లులోని బూడిద గడ్డవీధికి చెందిన కిరణ్, ఫణీంద్ర, నితన్ గాయపడ్డారు. ద్విచక్రవాహనంలో ఈ ముగ్గురు వెళ్తుండగా.. అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన వీరిని తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కిరణ్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

విధులకు వ్యవసాయాధికారుల డుమ్మా

కదిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయాధికారులు గురువారం విధులకు డుమ్మాకొట్టారు. పట్టణంలో గురువారం రథోత్సవం జరుగుతోంది. అయితే ఏ కార్యాలయానికి అధికారికంగా సెలవు లేదు. రైతు గంగిరెడ్డి తనకు వ్యవసాయ పరికరాలు కావాల్సి ఉండగా, కదిరిలోని అగ్రికల్చర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడికెళ్లితే అధికారులు కార్యాలయానికి, గేటుకు తాళాలు వేశారు. ఏడీ సత్యనారాయణను గంగిరెడ్డి ఫోన్‌లో సంప్రదించారు. తాను పట్టణంలో క్యాంపులో ఉన్నానని సమాధానం చెప్పినట్లు ఆ రైతు తెలిపారు. ఏఓ శ్రీనివాసరెడ్డి ఫోన్ తీయలేదని ఆ రైతు చెప్పారు. దీంతో కార్యాలయంతో పాటు గేటు ఫొటోలు తీసుకుని ఆంధ్రజ్యోతికి పంపి, తన బాధను ఆ రైతు వెళ్లబోసుకున్నాడు.


వ్యవసాయ కార్యాలయం గేటుకు తాళం వేసిన దృశ్యం

తగ్గుతున్న భూగర్భజలం..!

● విద్యుత్ కోతతో రైతుల ఇబ్బందులు
● ఎండుతున్న పంటలు



నీరు అందక ఎండుతున్న బీట్‌రూట్ పంట

మడకశిర రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయబోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. ప్రస్తుతం వస్తున్న అరకొర నీటికితోడు అధికారులు ఏడుగంటలే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు విలవిల్లాడుతున్నారు. రైతులు సాగుచేసిన అరకొర పంటలు వాడుదశకు చేరాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటలు ఇవ్వాల్సి ఉండగా ఏడు గంటలు మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఆమిదాలగొంది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 4 నుంచి 11 గంటల వరకు, హరేసముద్రం పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 వరకు, గోవిందాపురంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మణూరు, కల్లుమర్రి పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. వ్యవసాయ బోరు బావుల కింద చాలా మంది రైతులు మిరపపత్తి, మొక్కజొన్న, బీట్‌రూట్, వక్క తదితర పంటలు సాగు చేశారు. వేసవి కాలం కావడంతో బోర్లలో నీటి మట్టం తగ్గిపోయింది. దీనికితోడు విద్యుత్ అధికారులు కేవలం ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని రైతులు కోరుతున్నారు.

తొమ్మిది గంటలు విద్యుత్ అందించాలి



వ్యవసయనికి తొమ్మిది గంటలు విద్యుత్ అందించాలి. మూడు ఎకరాల్లో బీట్‌రూట్, రెండు ఎకరాలు, వక్కతోట పంటలు సాగుచేశా. కల్లుమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కేవలం 7 గంటలు మాత్రమే ఇస్తున్నారు. అందులోకూడా కోతలు విధిస్తున్నారు. దీంతో పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

-నారాయణప్ప, రైతు, కల్లుమర్రి

ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం
- విశ్వనాథ్, విద్యుత్‌శాఖ ఏఈ, మడకశిర

వ్యవసాయానికి ఎక్కడా కోతలు విధించడం లేదు. నిరంతరాయంగా ఏడు గంటలు విద్యుత్ ఇస్తున్నాం. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో రైతులకు అనుకూలమైన సమయాల్లోనే విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆక్రమణలు తొలగిస్తేనే డ్రైనేజీలు శుభ్రం



కాలువలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్

హిందూపురం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇష్టారాజ్యంగా డ్రైనేజీలు ఆక్రమించారని, వాటిని తొలగిస్తేనే పారిశుధ్య కార్మికులు కాలువ శుభ్రం చేయగలరని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం ఆయన ముక్కిడిపేటలో పర్యటించాడు. అక్కడ డ్రైనేజీలో మురుగునీరు వెనక్కు వస్తున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఎలా పడితే అలా డ్రైనేజీలు ఆక్రమించేశారని, దీంతో కాలువలు ఎలా శుభ్రం చేస్తారని చైర్మన్ ప్రశించారు. కాలువలు శుభ్రం చేయాలంటే ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ నసీరా బాను, టీడీపీ నాయకులు ఉన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ మహిళ
సునీతా విలియమ్స్



బెలూన్లు ఎగురవేసి ఆనందం వ్యక్తం చేస్తున్న టీచర్లు, విద్యార్థినులు

హిందూపురం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచం గర్వించదగ్గ మహిళ సునీతా విలియమ్స్ అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి అన్నారు. తొమ్మిది నెలల అనంతరం ఆమె భూమికి చేరిన సందర్భంగా విద్యార్థులతో కలిసి గురువారం బెలూన్లు ఎరగవేసి ఆనందం వ్యక్తం చేశారు. ఎనిమిది రోజుల అంతరిక్ష పరిశోధన కోసం వెళ్లి 9 నెలలు ఉండాల్సి వచ్చిందన్నారు. 60 ఏళ్ల వయసులో సాహసయాత్ర చేసిన భారతీయ వనితగా చెప్పుకోవడాని గర్వపడుతున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీలక్ష్మీ, యశోదాదేవి, శ్రీధర్, భోజప్ప, సరస్వతి, ప్రకాష్‌రావు, సుబ్బరాయుడు, బాలరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

నోటి సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు బ్రష్‌లు, టూత్‌పేస్ట్‌లు అందజేస్తున్న వైద్యులు

హిందూపురం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి) నోటి సంరక్షణతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ దంత సర్జన్ డాక్టర్ భూపాలం విజయ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ మానవుని శరీరంలో నోరు అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంటుందన్నారు. దంతాలు శుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. దంతాల సంరక్షణ ఎలా చేసుకోవాలి తదితర విషయాలపై సూచనలు చేశారు. డాక్టర్లు బాబాఫక్రుద్దీన్, అపర్ణ, ప్రేమ్‌కుమార్, డీఐఈసీ సిబ్బంది లోకేష్, చైతన్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు పాటించండి



వరిపంటను పరిశీలిస్తున్న ఏడీ సనావుల్లా

లేపాక్షి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసే పంటలకు విచ్చలవిడిగా ఎరువులు వాడకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ డీఆర్‌పీ ఏడీ సనావుల్లా సూచించారు. గురువారం మండలకేంద్రంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వరిపంటలను పరిశీలించి కలుపుమొక్కలు నివారించడంలో మెలకువలను రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనమేరకే ఎరువులు వాడాలన్నారు. అనంతరం మొక్కజొన్న, వరి, రాగి పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీలత, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చిగతుర్పిలో తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగతుర్పి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మనూనాయక్, ఏఈ హరి తెలిపారు. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు కొత్తగా బోరు వేయడంతో అందులో సమృద్ధిగా నీరు పడ్డాయి. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్థులు భోజరాజు, తిమ్మన్న, మంజునాథ్, శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు.

పావగడకు చేరిన తుంగభద్ర నీరు

పావగడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నీరు ఎట్టకేలకు గురువారం పావగడ తాలూకా కోటగుడ్డం గ్రామ పంచాయతీ శైలాపురం గ్రామానికి చేరింది. జిల్లా పంచాయతీ, పావగడ తాగునీటి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నీటి తరలింపు పనులు వేగంగా పూర్తయ్యాయి. గురువారం శైలాపురం గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. జేజేఎం పథకం కింద చేపట్టిన పైప్‌లైన్ల ద్వారా తుంగభద్ర నీరు కొళాయిల ద్వారా వదిలారు. ఈ నీరు తాగేందుకు ఎంతో ఉపయోగపడతాయని ఏఈఈ కావ్య, తాగునీటిశాఖ ఇంజనీర్ బసవలింగప్ప పటేల్ అన్నారు. కార్యక్రమంలో మెగా కంపెనీ అధికారి అశోక్, నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



తాగునీటిని పట్టుకుంటున్న మహిళలు

అటవీ సంరక్షణకు చర్యలు చేపట్టండి

● సాహితీ గగన్‌మహల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

పెనుకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే కొందరు ఆకతాయిలు కొండకు నిప్పు పెట్టడంతో వన్యప్రాణులు, అటవీసంపద బుగ్గిపాలవుతుందని, అటవుల సంరక్షణపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సాహితీ గగన్‌మహల్ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. వేసవిలో ఆకతాయిలు కొండకు నిప్పుపెట్టడంతో గడ్డి పూర్తిగా కాలిపోయి పశువులకు మేతలేక అలమటిస్తాయన్నారు. కొండల్లో అటవీ సంపద పెంపొందించడానికి కొత్తగా నాటిన మొక్కలు మొలకెత్తాయని, వివిధ రకాల విత్తనాలు, కాలి బూడిదవుతున్నాయన్నారు. జంతువులు వివిధ రకాల క్రిమికీటకాలు పక్షులు నాశనమవుతున్నాయన్నారు. ప్రభుత్వం చొరవతీసుకుని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మేలలో కొండలకు నిప్పు పెట్టకుండా కాపాడటానికి ఉపాధి హామీ పథకం కింద కూలీలను గార్డులుగా నియమించాలని కోరారు. అలాగే డ్రోన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కుట్టు శిక్షణకు 200 దరఖాస్తులు

పెనుకొండ టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో మంత్రి సవిత ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణకు 200మంది దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్‌లు దరఖాస్తులు స్వీకరించారు. 22వ తేదీ వరకు దరఖాస్తులు వేసేందుకు వెసలుబాటుందని ఈ అవకాశాన్ని ఓసీ, బీసీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రమణమ్మ, లక్ష్మీదేవమ్మ, పొలగూర్ల శ్రీనివాసులు, నంజుండ, గోపాల్ పాల్గొన్నారు.

రూడ్‌సెట్ ఆధ్వర్యంలో..: రూడ్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 నుంచి 30రోజులపాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 18-45సంవత్సరాల వయసుకలిగి ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళలు అర్హులన్నారు. అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణతోపాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9618876060 నంబరును సంప్రదించాలన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టండి

హిందూపురం అర్బన్, మార్చి, 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ కళాశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయని, అప్పుడే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి తమ కళాశాలలో చేర్పించాలని కార్పొరేట్ సంస్థలు ఒత్తిళ్లు చేస్తున్నారని అన్నారు. వీటిని విద్యాశాఖ అధికారులు నియంత్రించాలని కోరారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

మడకశిర రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని నీలకంఠాపురం ఆలయంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు వధూవరులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి కోరారు. ఏప్రిల్ 4లోపు వారి దరఖాస్తు పత్రాలు ఆలయ కమిటీకి అందించాలన్నారు.

23న సేవాలాల్ జయంతి

మడకశిర టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 23వ తేదీన సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సేవాలాల్ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సమావేశాన్ని నిర్వహించడంతోపాటు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు.

నియోజకవర్గ అధ్యక్షురాలిగా శ్రీదేవి



నూతన కమిటీ సభ్యులు

మడకశిరటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఏపీఎన్జీఓల సంఘం మహిళా విభాగ నియోజకవర్గ అధ్యక్షురాలిగా శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కన్వీనర్‌గా కౌసర్‌బేగం, కో-చైర్‌పర్సన్‌గా బి.శిఫాకౌసర్, ట్రెజరర్‌గా లలితమ్మ, వైస్ చైర్‌పర్సులుగా మేఘన, హారతి, సునీత, సంయుక్త కన్వీనర్లుగా నాగమణి, రాధలను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ సోనీబాయి, ఏపీఎన్జీఓ నియోజకవర్గ అధ్యక్షులు రాము పాల్గొన్నారు.

రేపు ఇస్కాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ కార్యక్రమానికి కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ఇస్కాన్ బృందం

హిందూపురం అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత పోలీస్ బ్యారెక్స్ గుడ్డం ప్రాంతంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణ ఆలయానికి భూమి పూజ చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు బక్తబృందదాస్, గోవింద్‌దాస్, చారుకీర్తి, నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ చేతన్‌ను కలిసి భూమి పూజకు హాజరు కావాలని కోరినట్లు వారు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి కార్యక్రమానికి హాజరవుతానని తెలిపినట్లు వివరించారు.

నేడు రామతీర్థ శ్రీపాదుల ఆరాధనోత్సవాలు

పెనుకొండ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపక్కన ఆర్టీఓ చెక్‌పోస్టు వద్ద వెలసిన ఉద్దండ రామచంద్ర తీర్థ శ్రీపాదుల 1008వ ఆరాధనోత్సవాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామివారి బృందావనానికి ప్రత్యేక అలంకరణ, అర్చకుల ఆధ్యాత్మిక ప్రసంగం, అనంతరం అన్నసంతర్పణ చేస్తున్నట్లు వారు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

మడకశిరటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉపాధ్యాయ భవన్‌లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణతోపాటు పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మంజువాణి, సీడీపీఓ నాగమల్లేశ్వరి కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ 0-3, 3-6 సంవత్సరాల చిన్నారులకు పోషణ, న్యూఎడ్యుకేషన్ పాలసీతోపాటు చిన్నారులకు అంగన్‌వాడీ సెంటర్లలో నేర్పించడానికి ఎలాంటి మెలకువలు పాటించాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

అమరాపురం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డు, మసీదు వీధుల్లో డ్రైనేజీని, ఇంటి పరిసరాలను పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేశారు. గౌడనకుంట గ్రామంలో ఆటో రిక్షాను తీసుకెళ్లి ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేశారు. వీధుల్లోని కొళాయిల వద్ద పరిశుభ్రంగా ఉంచారు. తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి ఆవరణలోనే మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అమరాపురం పంచాయతీ కార్యదర్శి సుధాకర్, మనోహర్‌శర్మ పాల్గొన్నారు.

మార్కెట్‌కు రూ.20.05 లక్షల ఆదాయం

పెనుకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి సంబంధించి 2025-26సంవత్సరానికి మార్కెట్ వేలంపాట ద్వారా రూ.20.05లక్షలు ఆదాయం వచ్చినట్లు కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం సమావేశ భవనంలో కమిషనర్ ఆధ్వర్యంలో దిన, వారపుసంత, మాంసం దుకాణాలకు వేలంపాట నిర్వహించారు. పట్టణానికి చెందిన పఠాన్ జబ్బార్‌ఖాన్ రూ.20.05లక్షలకు వేలం దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు, ఆర్ఐ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



నందలాల్‌కుమార్(ఫైల్)

గోరంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగానిపల్లి వద్ద గ్రీన్‌ఫీల్డు హైవే రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా సిమెంటు ట్యాంకర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నందలాల్‌కుమార్(36) అనుమానాస్పద స్థితిలో గురువారం మృతిచెందాడు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం గాజీపూర్ జిల్లా సగేపల్లికి చెందిన నాగేశ్వరప్రసాద్ కుమారుడు నందలాల్‌కుమార్ కాగానిపల్లి వద్ద లారీ ఇర్కుపోవడంతో అక్కడే ఉన్న నీటిట్యాంకర్‌లారీ కింద నిద్రించినట్లు తోటి వర్కర్లు తెలిపారు. తోటి కార్మికులు నందలాల్‌కుమార్‌ను గోరంట్ల ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. నీటి ట్యాంకర్ డ్రైవర్ చూసుకోకుండా ముందుకు వెళ్లడంతో లారీ కిందపడి మృతిచెందినట్లు వర్కర్లు చెబుతున్నారు. మృతుడి శరీరంపై ఎటువంటి రక్తగాయాలు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎంపై విచారణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ పద్మప్రియ

హిందూపురం అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యంపై గతంలో కొందరు చేసిన ఫిర్యాదులపై డీవైఈఓ పద్మప్రియ విచారణ అధికారిగా గురువారం పాఠశాలకు వచ్చారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ మంత్రి పేషీ నుంచి డీఈఓకు ఆదేశాలు అందగా ఆయన డీవైఈఓకు బాధ్యతలు అప్పగించినట్లు ఆమె తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు ఎవరు చేస్తారు? ఆ సమయంలో కమిటీ ఏదైనా వేశారా, 2024-25 సంవత్సరానికి అడ్మిషన్లు జరిగినపుడు విద్యార్థుల నుంచి ఎంత ఫీజు వసూలు చేశారు? పాఠశాలలో చెట్లు తొలగించారా? తొలగిస్తే దానిని ఏ విధంగా తొలగించారు? ఎవరి అనుమతులు తీసుకొని తొలగించారు, వాటిని ఏ విధంగా వినియోగించారు, విద్యా సంవత్సరంలో స్టూడెంట్ కిట్లు అందరికీ అందాయా, అందలేదని ఏ విద్యార్థి నుంచి అయినా ఫిర్యాదులు వచ్చినాయా. అంటూ పలు ప్రశ్నలను పేపర్‌లో రాసి అందులో ఉపాధ్యాయులతో వారి అభిప్రాయాలు సేకరించారు. అదే విధంగా హెచ్‌ఎం స్టూడెంట్ కిట్లు అమ్ముకున్నారు, చెట్లు నరికించి అమ్ముకున్నారు, టీసీలకు విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేశారుని ఫిర్యాదులు అందాయని, వాటిపై కూడా అభిప్రాయాలు తెలియజేయాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. దీనిపై ఉపాధ్యాయులు ఎవరికి వారు లిఖితపూర్వకంగా పేపర్‌లో రాసి ఇచ్చారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం:
పద్మప్రియ, డీవైఈఓ

హెచ్‌ఎంపై వచ్చిన ఫిర్యాదులపై విచారణకు వచ్చాను. డీఈఓ ఆదేశాలతో ఉపాధ్యాయుల నుంచి వారి అభిప్రాయాలు లిఖిత పూర్వకంగా సేకరించాను. ఆ నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతాను.

రంజాన్ వేళలు

హిందూపురం	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.09
పెనుకొండ	ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.09
	(శుక్రవారం సాయంత్రం)	(శనివారం ఉదయం)



విజయవాడలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించిన బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్ పోటీల విజేతలు మంత్రులు సవిత, టీజీ భరత్‌కు ట్రోఫీని అందజేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సత్ప్రవర్తనతో మెలగండి

● న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

హిందూపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నేరాలు చేసి జైలు జీవితం గడుపుతున్న వారు బయటికి వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నేరాలుచేసి జైలుపాలైతే మీ కుటుంబ సభ్యులు సమాజంలో ఇబ్బంది పడతారన్నారు. వీరు బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలిగి మరోసారి తప్పు చేయకుండా సన్మార్గంలో నడవాలన్నారు. అనంతరం జైలులో రికార్డులు పరిశీలించారు. నిందితులు ఏఏ కేసుల్లో జైలులో ఉన్నారని ఆరాతీశారు. 18ఏళ్లలోపు, 70ఏళ్లు పైబడినవారుంటే వెంటనే న్యాయస్థానానికి తెలియజేయాలన్నారు. ఆయన వెంట బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాది సిద్దు, సదాశివరెడ్డి, సంతోష్‌కుమారి, మురళి, అంజినమ్మ, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద ఉన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు

గోరంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం గోరంట్ల బస్టాండ్‌లో గురువారం దాతలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు పలువురి ఆర్థిక సహాయంతో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, రాఘవ, రంగ పాల్గొన్నారు. బస్టాండ్ కూడలిలో బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు ముద్దల వెంకటరాముడు, బాలాజీ భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

మద్యం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

హిందూపురం/గోరంట్ల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ పెనుకొండ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి బిజ్జప్ప తీర్పు వెల్లడించారు. ధర్మవరం పట్టణం మారుతీ నగర్‌కు చెందిన శ్రీనాథ్, కదిరి అడపాల వీధికి చెందిన డేవిడ్‌నాథ్ 2020 ఆగస్టు 3న కర్ణాటక నుంచిగోరంట్ల మండలంలోకి అక్రమంగా మద్యం తీసుకువస్తుండగా అప్పటి గోరంట్ల సీఐ జయానాయక్ సిబ్బంది మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం సాక్షులు చెప్పిన ఆధారాలు రుజువు కావడంతో న్యాయాధికారి జైలు శిక్షవిధించారు. కేసులో ఏపీపీ శ్యామల వాదనలు వినిపించినట్లు గోరంట్ల సీఐ శేఖర్ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గోరంట్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారి కూడలిలో కారుఢీకొని బాషా అనే వ్యక్తికి గాయాలయ్యాయి. సోమందేపల్లి మండలంలోని స్నేహలతనగర్‌కు చెందిన బాషా పాలసముద్రం క్రాస్‌లోగురువారం రోడ్డు దాటుతుండగా కియ పరిశ్రమకు చెందిన కారు వేగంగా ఢీకొనడంతో ఆ వ్యక్తి గాయపడ్డాడు. అనంతరం కారు ఆపకుండా వెళ్లిపోగా, కొంత మంది యువకులు వెంబడించి కారును సోమందేపల్లి పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. గాయపడిన బాషాను పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

చిరుత దాడిలో ఐదు మేకల మృతి

పావగడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలోని కన్న మేడి గ్రామంలో చిరుత పులి దాడి చేయడంతో ఐదు మేకల మృతిచెందిన ఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. మేకల కాపరి హనుమంతరాజు తెలిపిన మేరకు మేకలు కాసుకుంటూ పొలంలో ఉండగా పొదల్లో దాగున్న రెండు చిరుతలు ఒక్కసారిగా మేకలపై దాడి చేయడంతో భయాందోళనకు గురయ్యాయని తెలిపారు. చూస్తున్నట్లుగానే ఐదు మేకలను చంపేశాయన్నారు. అటవీ ప్రాంతాల్లోకి వెళ్లాలంటేనే భయంగా ఉందన్నారు. ఘటనా స్థలానికి పశువైద్యాధికారులు పరిశీలించారు. రూ.80వేల వరకు నష్టం వాటిల్లిందని, అటవీశాఖాధికారులు సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ప్రకటన

వజీర్‌ఖాన్ S/o K. కమ్రుద్దీన్‌ఖాన్ D.No.2/83B, అగళి, శ్రీసత్యసాయి జిల్లా. Doc.No.2209/ 2019, సర్వే నెం.293-6లో Extent 1.30 పైకి 75 చ॥గు॥(2 ఐటంలు)లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందూపురం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో 7 రోజుల లోపు హిందూపురం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించ చగలరు.
ఐటం-1 హద్దులు : తూర్పు : నీకు అమ్మిన 2వ నెంబర్ ప్లాటు, పడమర: అబ్దుల్లా ఖాన్ ఇల్లు, ఉత్తరం : లక్ష్మక్క ఇల్లు, దక్షిణము: 12 అడుగుల రోడ్డు.
ఐటం-2 హద్దులు : తూర్పు : మహబూబ్ బాష ఇల్లు, పడమర: నీకు అమ్మిన 1.30పైకి, ఉత్తరం : నరసింహప్ప ఇల్లు, దక్షిణము: 12 అడుగుల రోడ్డు.
H. నాగేశ్వరరావు,అడ్వకేట్, హిందూపురం.

ప్రకటన

బి.నరసింహులు S/o బి.రామదాసు, జర్నలిస్ట్ కాలనీ, పెనుకొండ, శ్రీసత్యసాయి జిల్లా. Doc.No.3346/2024, సర్వే నెం.670-E, 673-1లో 1.77 చ॥గు॥(ప్లాట్ నెం.20)లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందూపురం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో 7 రోజుల లోపు హిందూపురం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించ చగలరు.
హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.27, పడమర: 12 అడుగుల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.20పైకి మిగిలిన బయలు జాగా, దక్షిణము: 12 అడుగుల వెడల్పు గల రోడ్డు.
H. నాగేశ్వరరావు,అడ్వకేట్, హిందూపురం.

ప్రకటన

గౌసియా బాను W/o వజీర్‌ఖాన్, D.No.2/83B, అగళి, శ్రీసత్యసాయి జిల్లా. Doc.No.2208/2019, సర్వే నెం.293-6లో Extent 1.30 పైకి 69 చ॥గు॥లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందూపురం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో 7 రోజుల లోపు హిందూపురం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించ చగలరు.
హద్దులు : తూర్పు : నజీ అహమ్మద్ ఖాన్ బయలు, పడమర: బాషాసాబ్ బయలు, ఉత్తరం : కుమ్మర సంజీవప్ప బయలు, దక్షిణము: 6 అడుగుల రోడ్డు.
H. నాగేశ్వరరావు,అడ్వకేట్, హిందూపురం.

ప్రకటన

ఈడిగ క్రిష్ణవేణి W/o Late ఈడిగ రమణ, D.No.2-49, తురకాలపట్నం పోస్ట్, బొక్కసంపల్లి పంచాయతీ, ఎర్రీ నగర్, రొద్దం మండలం, శ్రీసత్యసాయి జిల్లా. Doc.No.3146/ 2023, సర్వే నెం.115-2Aలో 484 చ॥గు॥లను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, హిందూపురం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్నచో 7 రోజుల లోపు హిందూపురం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించ చగలరు.
హద్దులు : తూర్పు :ఈ.టి.శ్రీరాములు జమీను, పడమర: ఈ.టి. రవికుమార్ జమీను, ఉత్తరం : ఈ.టి. రవికుమార్ జమీను, దక్షిణము: బి.నరసింహులు జమీను.
H. నాగేశ్వరరావు,అడ్వకేట్, హిందూపురం.